# ఉగాది నుంచి ఉగాదికి

నా కళ్ళతో అమెరికా

మిరియాల శ్రీ సత్య భ్రమరార్జున ఫణి ప్రదీప్

5/15/2009

ఉగాది నుంచి ఉగాదికి (నా కళ్ళతో అమెరికా) -1 ..... 3
ఉగాది నుంచి ఉగాదికి (నా కళ్ళతో అమెరికా) - 2 ..... 4
ఉగాది నుంచి ఉగాదికి (నా కళ్ళతో అమెరికా) - 3 ..... 5
ఉగాది నుంచి ఉగాదికి (నా కళ్ళతో అమెరికా) - 5 ..... 8
ఉగాది నుంచి ఉగాదికి (నా కళ్ళతో అమెరికా) - 6 ..... 9
ఉగాది నుంచి ఉగాదికి (నా కళ్ళతో అమెరికా) – 7 ..... 11
ఉగాది నుంచి ఉగాదికి (నా కళ్ళతో అమెరికా) – 8 ..... 13

# ఉగాది నుంచి ఉగాదికి (నా కళ్ళతో అమెరికా) -1

10 Apr 2009

**ముందు మాట**

సర్వధారిని భారతదేశంలో స్వాగతించి విరోధిని అమెరికాలో స్వాగతించాను. సంవత్సరంలో ఎంత మార్పు?
అవును సంవత్సరమంటే తక్కువ సమయమా...
అమెరికా.... కొంతమంది కళ్ళకు అది "ఆహా మెరిక"... కొంతమంది కళ్ళకు "అదో మరక"
నాకు విదేశాలు తిరగాలన్న కోరిక పెద్దగా లేదు. కానీ 2005-06 కాలంలో అమెరికా వెళ్ళాలనే కోరిక మొదలయ్యింది. 2006లో నా L1 వీసా నిరాకరించినప్పుడు అది ఇంకా బలపడింది. మొత్తానికి సంవత్సరకాలం తరువాత 2007లోH1 వచ్చిన తరువాత నా అదృష్టం బాగుండి జర్మనీ వెళ్ళాను. (అది దురదృష్టమని మొదట్లో నాకనిపించేది, కానీ అమెరికా వచ్చిన తరువాత ఆ అభిప్రాయంలో పెనుమార్పు వచ్చింది)
సుమారు సంవత్సరం (మే నాటికి సంవత్సరమవుతుంది) పాటు ఈ అమెరికాలో నేను చూసినది, తెలుసుకున్నదీ తక్కువే. అందుకే ఈ స్వగతంలో కేవలం నా కళ్ళతో చూసినవే ఉంటాయి. ఇది అమెరికా మొత్తం గురించి కాదు. నేను చూసిన చిన్న అమెరికా గురించి.

ఇక లోనికి అడుగేస్తే, మే 2008 లో ఒక వేసవికాలపు సాయంత్రం అమెరికాకు నా ప్రయాణాన్ని మొదలుపెట్టాను అప్పటి ముందు అనుభవాల దృష్ట్యా ప్రయాణంలో నిద్రపోయా.. జెట్ లాగ్ అనే పదం యొక్క అర్థం దిగాక తెలిసింది. నేను అమెరికాకు వచ్చిన ప్రదేశం గ్రీన్ విల్లే (పచ్చని గ్రామము). పేరుకు తగ్గట్టే పచ్చని ప్రదేశం.

ఎలాంటి ప్రదేశమైనా మనిషికి కావలసినవి మూడే అంశాలు కూడు గుడ్డ నిద్ర ఈ మూడింటితో పాటు అనుకూలించవలసిన మరో విషయం వాతావరణం. అమెరికా అనగానే శీతలదేశమనే భావనతో వచ్చాను. అలాంటిది బెజవాడ వేడి నన్ను పలకరించే సరికి నాకు మతి పోయింది. కొంచెం సంతోషం కూడా అనిపించింది. ఇలా వాతావరణం అనుకూలించడంతో రోజూ శుభ్రంగా వాకింగ్ చేసేవాడిని. (వాకింగ్ అంటే అది ముసలివాళ్ళ పని అని కొందరు వేరే అర్థం తీసారు అది వేరే విషయం)

కూడు, విదేశాలలో శాఖాహారులకు ఎదురయ్యే ఇబ్బందులకు అంతే లేదు అందుకే మన వంట మనం చేసుకున్నంత కాలం కూడుకు లోటు లేదు. గుడ్డ, జీతం బాగున్నంతసేపూ ఈ విషయంలో బాధ లేదు. కానీ ప్రదేశాన్ని బట్టి మన జీవనశైలిలో మార్పులు చోటు చేసుకుంటాయి. నాకు నాకులా ఉండడం ఇష్టం కనుక, మార్పులు లేవు.
నిద్ర, అమెరికాలో దిగిన వెంటనే రెండు రోజులు హోటల్ లో ఉన్నా, ఆ తరువాత ఒక అపార్ట్ మెంట్ తీసుకుని అక్కడకు మారాము. నాకు అమెరికాలో నచ్చిన విషయాలలో ఒకటి అపార్ట్ మెంట్ కల్చర్ చక్కగా ఒక ఆఫీస్ పెట్టుకుని అద్దెకివ్వడం, అగ్రిమెంట్స్ రాయడం, ఫిర్యాదులు తీసుకోవడం. నాకు బాగా నచ్చింది. దానికి తోడు ఆ విశాలమైన కాంప్లెక్సుల్లో సౌకర్యాలు కూడా బాగున్నాయి. అయితే ఇక్కడ కొన్ని చిక్కులు లేకపోలేదు. మధ్యలో ఖాళీ చేసి వెళ్ళాలంటే అగ్రిమెంట్ బ్రేకేజీ కింద అధిక మొత్తంలో అద్దె చెల్లించాల్సి రావడం (ఈ చిక్కుల్లో పడవలసి వచ్చింది తరువాత).

అమెరికాలో కనీస అవసరాలంటే ఆ మూడే కాదు వాటికి మరో మూడు కలపాలి కారు, ఇంటర్ నెట్ , ఫోన్
వీటిలో ఏది కావలన్నా అమెరికా వచ్చిన తరువాత కనీసం మూడు నుంచి నాలుగు వారాలు ఆగాలి వీటిలో ఏదీ లేకుండానే అమెరికాలో నా జీవితం మొదలయ్యింది.
కారు, ఈ విషయం తలచుకుంటే బాధ కలుగుతుంది నాకు, ఇక్కడ లైసన్సు తీసుకుందామని వచ్చి నేను చేసిన పెద్ద తప్పు ఇదే ఈ గ్రీన్ విల్లే లో ఆరునెలల పాటు లెర్నింగ్ లైసెన్సు మీద ఉంటేనే లైసెన్సు తీసుకోనిస్తారు. చిన్న గ్రామం కావడంతో ప్రతీ దానికి కారు కావలసిందే. కారు లేక జీవితం పరాధీనమయ్యింది. ఇది ఎంతో బాధ కలిగించే విషయం.
ఇంటర్ నెట్ , అమెరికా వచ్చిన తరువాత సోషల్ సెక్యూరిటి నంబర్ తీసుకుంటేనే మనకు అధికారిక గుర్తిపు ఉంటుంది. అయితే అది రావాలంటే కనీసం నెల రోజులు పడుతుంది. అంతవరకు మనకు ఎలాంటి కనెక్షన్లు ఇవ్వరు. (ఇంటి అగ్రిమెంట్, బాంకు అకౌంట్ లాంటివాటికి పాస్ పోర్టు చాలు. అయితే తరువాత సోషల్ సెక్యూరిటీ నంబర్ ఇవ్వాలి) నిజానికి ఈ విషయం మొదట్లో చిరాకు తెప్పించినా తరువాత బాగా నచ్చింది. ప్రతీ మనిషికీ ఒక అధికారిక గుర్తింపు ఉంది కదా మరి. ఇక ఇంటర్ నెట్ కనక్షన్ వచ్చేవరకు కొలీగ్ కనక్షన్ వాడేవాడిని.
ఫోన్, చాలా మంది ఐ ఫోన్ తీసుకోమని చెప్పినా, నాకు కూడా అనిపించినా తీసుకోలేదు. కారణం చాలా చిన్నది. కానీ ప్రభావం చాలా పెద్దది. ఏపిల్ యొక్క నియంతృత్వ పోకడలు, ఐ ఫోన్ మీద సంవత్సరం పాటు రాయాల్సిన అగ్రిమెంట్ , సంవత్సరంలో దాని మీద పెట్టాల్సిన ఖర్చు సుమారు 800 డాలర్లకు సమీపించడం. అందుకే సులభంగా ప్రీ పెయిడ్ సిమ్ తీసుకుని దాన్ని నా జర్మనీ ఫోన్ తో వాడసాగాను.
ఇక మొదలైంది అ"మెరిక"నా లేక అ"మరకా" అన్నది తెలుసుకునే యత్నం......

# ఉగాది నుంచి ఉగాదికి (నా కళ్ళతో అమెరికా) - 2

14 Apr 2009

కనీస అవసరాలు తీరిన తరువాత, బాగుండవలసినవి పని చేసే ప్రదేశం మరియు మనతో పని చేసే వ్యక్తులు. వీటితో పాటు పని రాక్షసులకైతే పని బాగుండటం, సరదా బుల్లోళ్ళకైతే పని లేకపోవటం (జీతం రావాలండోయ్).

పని విషయంలో నాకు నిరాశ కలగలేదు. పని చేసే ప్రదేశం విషయానికి వస్తే కొన్ని కొత్త విషయాలు తెలిసాయి, ఆఫీసులో కొన్ని క్యూబికల్సుకు మరియు కొన్ని గదులకు " ఎక్స్ పోర్ట్ కంట్రోల్ ఏరియాస్ " అన్న బోర్డులు తగిలించి కనిపించాయి. ఏమిటా అని తెలుసుకుంటే, ఆ బోర్డు పెట్టిన ప్రదేశంలోనికి అమెరికన్లు కానివారికి ప్రవేశం నిషిద్ధమని తెలిసింది. కొంచెం వళ్ళు మండినప్పటికీ వారి భద్రత వారిదని సరిపెట్టుకున్నా. మన ఇంటిలో మాత్రం అతిధులకు ప్రవేశం లేని ప్రదేశాలను నిర్దేశించమా?

నా జర్మనీ అనుభవం దృష్ట్యా అమెరికన్లు కూడా అంత సీరియస్ గా ఉంటారనే ఊహించాను. ఎంతైనా మనం చూసినదే ప్రపంచం కదా!! అయితే నా ఊహలన్నీ చాలా త్వరగానే తలకిందులయ్యాయి, మా టీములో అందరూ ఎంతో స్నేహపూర్వకంగా మసలుకోవడంతో. ఇక్కడికి వచ్చిన కొన్ని రోజులలోనే నాకర్ధమయిన సంగతేమంటే, ప్రతీ టీములోనూ కనీసం ఒక్క భారతీయుడైనా ఉంటాడని. భారతీయ ఝుండా ప్రతీ చోటా ఎగురుతున్నందుకు గర్వపడాలో పడగనీడలాంటి అమెరికా ఝుండాకింద పని చేస్తున్నందుకు బాధపడాలో అర్ధం కాలేదు. (ఆ పడగల కింద విష్ణువులా పడుకుని లక్ష్మితో కాళ్ళు ఒత్తించుకోవాలో ఆ పడగలపైన కృష్ణునిలా నాట్యమాడాలో తేల్చుకోవలసింది మనమే)
ప్రతీ టీములోనూ భారతీయుడనగానే ఒక పిట్ట కధ గుర్తుకొస్తోంది. ఒక జాత్యహంకార మేనేజర్ తన కింద పని చేసే భారతీయులను

చిన్న చూపు చూస్తుంటే వాడి పైన ఉన్న మేనేజర్ భారతీయుడయ్యాడట అది తెలిసిన ఈ జాత్యహంకార మేనేజర్ కి పాపం నోటి వెంట మాట లేదట (ఎవరో చెప్పగా విన్నాను)
ఇంత మంది భారతీయులను అమెరికాలో చూసాక ఒక రోజు ఒక కల కన్నా, అమెరికాలో పని చేస్తున్న భారతీయ మేధో సంపద మొత్తం భారతదేశానికి తిరిగి వస్తే, వచ్చి భారతీయ కంపనీలు ప్రారంభిస్తే.... అబ్బో మన దేశానికి తిరుగే ఉండదు.... (పగటి కలలు కనొద్దని పెద్దలు చెప్తే వింటామా!!)
అతి త్వరలోనే అర్ధమయిన మరో సంగతి, ఇక్కడికి వచ్చిన భారతీయులలో అతి తక్కువ శాతం మాత్రమే భారతదేశానికి తిరిగి వెళ్ళాలనుకునేవాళ్ళని, మిగిలిన వారిలో అత్యధిక శాతం అమెరికాలో ఉంటూ ఇండియాకు వెళ్తాను అని సుత్తి చెప్పేవాళ్ళని ఇక మిగిలినవారు మాత్రం అమెరికాలో ఉండటానికే సిద్దపడినవాళ్ళని. భారతీయులను కట్టిపడేసంత సరుకేముంది అమెరికాలో ?

ఇక మళ్ళీ అమెరికన్ల దగ్గరకొద్దాం, అమెరికా అనగానే వారికి సంస్కృతి లేదనీ వారికి కుటుంబాలంటే విలువ లేదన్నది మీడియా చేసే ప్రచారం. ఇందులో నిజమెంత అన్నది నేను నిర్ణయించ(లే)ను కానీ నేను చక్కని అమెరికన్ కుటుంబాలను చూసాను. మనవళ్ళు మనవరాళ్ళ కోసం ఆఫీస్ కు సెలవుపెట్టి వారి బాగోగులు చూసే ఒక మేనేజరు కూతురి కోసం తన పని వేళలను మార్చుకునే తల్లితండ్రులు (ఇద్దరూ టీమ్ లీడర్లు). వారాంతాలలో సామాజిక సేవ చేసే టీమ్ లీడ్. తన తల్లి తనను సరిగ్గా చూడలేదని బాధ పడుతూనే, తన కూతురికి అలాంటి లోపం రానివ్వని టీమ్ లీడ్. ప్రకృతిని ఇష్టపడుతూ, ప్రకృతి ఒడిలో కుటుంబంతో విశ్రాంతి తీసుకునే ఒక సీనియర్ ఇంజినీర్. తల్లితండ్రులను పట్టించుకోని అన్నతో మాట్లాడకుండా వారిని జాగ్రత్తగా చూసుకుంటున్న ఒక ఇంజినీర్. తన భార్య అనారోగ్యంతో ఉంటే ఆఫీసుకు సెలవు పెట్టి పిల్లలు మరియు తన అర్ధాంగి బాగోగులు చూసుకునే ఇంజినీర్ అయితే, వీరిలో లోపాలు లేకపోలేదు...లోపాలు లేని మనిషెవరు ఇలలో? మన కళ్ళకు మన మెదడేమి చూపితే అదే కనిపిస్తుంది...

కనీసావసరాలు, పని చేసే వాతావరణం బ్రహ్మాండంగా కాకపోయినా ఒక మాదిరిగానైనా కుదిరాయి ఇక తరువాత చూడాల్సినదేమిటి ? నా కళ్ళతో చూసిన వాటిలో నా మెదడు నా వేళ్ళతో ఏ అనుభవాలను వ్రాయిస్తుందో?

# ఉగాది నుంచి ఉగాదికి (నా కళ్ళతో అమెరికా) - 3

17 Apr 2009

ప్రదేశమేదైనా మనిషికి కావలసినవి భద్రత, ఆరోగ్య పరిరక్షణకు చక్కని వసతులు మరియు మనిషిని ప్రశాంతంగా ఉంచే సమాజం.

అమెరికా ప్రయాణం ఖాయమైపోగానే నేను చేసిన పని, అమెరికాలోని నా స్నేహితులకు "నేనొచ్చేస్తున్నానోచ్ " అని చాటింపెయ్యడం. అందరూ ఒక్కటే ఉచిత సలహా ఇచ్చారు "ఎప్పుడూ చిల్లర నోట్లు దగ్గర పెట్టుకో, ఎవరైనా అడిగితే ఒక డాలర్ వెంటనే ఇచ్చేయ్ ... రాత్రి పూట ఒంటరిగా తిరగొద్దు " అని. ఎందుకూ అని అడిగే పిచ్చి ప్రయత్నం చెయ్యలేదు, ఎందుకంటే మీడియాలో భారతీయుల చావులు చూసాక కూడా అడగాలా ? మన ప్రాణమెక్కువా లేక డాలరెక్కువా అనుకోవాలా లేక నా ప్రాణం విలువ డాలరేనా అని బాధపడాలా అనుకుంటే ఇండియాలో ఉన్నప్పుడు నాకు సమధానం దొరకలేదు కానీ ఇక్కడకొచ్చాక, తుపాకులు దొరకడం ఎంత సులభమో చూసాక సమాధానమిట్టే దొరికింది 250$ పెడితే గన్నిచ్చేస్తుందాయె! ఎంత సులభమో చావడం లేదా చంపడం కదా!!
అయితే అదృష్టవశాత్తు నాకు అలాంటి పరిస్థితులు ఎదురు కాలేదు. నేనున్న పట్టణం చిన్నది కావటం, దానికి తోడు ప్రశాంతమైన వాతావరణం ఉండడంతో రాత్రి సమయమెంతైనా బయటకు వెళ్ళడానికి పెద్దగా ఆలోచించనవసరం లేకపోయింది. అలాగని

అమెరికాలో పోలిసులు పనికిరాని వాళ్ళు వగైరా పిచ్చి కూతలు నేను కూయను ఎందుకంటే అమెరికన్ పోలిసులు నియమాలు, విధి నిర్వహణ విషయంలో చాలా సీరియస్ గా ఉంటారు.

అమెరికా వెళ్తున్నానని అంతకు ముందు వెళ్ళి వచ్చిన వాళ్ళకు చెబితే సాధారణ రోగాలకు మందులు తీసుకెళ్ళమన్నారు ఆసుపత్రికి వెళ్తే నీకు ఎక్కువ ఖర్చు అవుతుంది కనుక జ్వరం, తలనొప్పి వగైరా వాటికి మందులు తీసుకెళ్ళమన్నారు. సరే అని అలాగే తీసుకుని వచ్చా. అమెరికాలో ఉండవలసిన కనీసమైన వాటిలో మెడికల్ ఇన్స్యూరెన్సు కూడా చేర్చాలి. ఎందుకంటే పొరపాటున చెయ్యో, కాలో విరిగితే అంతే సంగతులు కదా మరి.
చిన్న ఉదాహరణ, రెండు నెలల క్రితం ఒంట్లో కొంత నలతగా ఉండి ఆసుపత్రికి వెళ్ళా. అప్పటికి బీమా కవర్ చేసేసింది. ఆ తరువాత బీమా కంపనీ వాడికి ఎంత బిల్లయ్యిందా అని తెలుసుకుంటే అది సుమారు 250$ గా తేలింది. ఇంతా చేస్తే నాకొచ్చిన జబ్బూ ఏమీ లేదు, చేసిన పరీక్షలూ ఏమీ లేవు. ఇక చెయ్యి విరగడం, కాలు బెణకడం లాంటి వాటి సంగతి చెప్పకర్లేదు. మా కొలీగ్ భార్యకు డెలివరీ అయితే ఆ బిల్లు విలువ సుమారు 12000$ కు పైనే. (బీమా ఉంది అది వేరే విషయం). బీమా (భీమా) లేకపోతే పరిస్థితి ఎంత దయనీయమో చెప్పనవసరం లేదు కదా. బిల్లుల సంగతి పక్కన పెడితే, ఈవాళే(16 ఏప్రిల్ 2009) ఒక వింత పరిస్థితిని ఎదుర్కున్నా.. మా ఆఫీసుకి రెడ్ క్రాస్ వాళ్ళ రక్త దాన శిబిరం వచ్చింది ఉత్సాహంగా దానం చేద్దామని వెళ్ళా. అక్కడ తేలిన విషయమేమంటే, భారతీయులు అమెరికాలో రక్తదానం చెయ్యాలంటే భారతదేశాలన్ని విడిచి కనీసం మూడేళ్ళైనా ఉండాలి!!! ఎందుకు అంటే, భారతదేశం మలేరియన్ దేశం అట. (ఈ జాబితాలో చాలా దేశాలే ఉన్నాయి. ఇందులో మరీ జాతికి అవమానం అని గొంతు చించుకోవాల్సిన పని లేదు). అంటే, నేను మరో ఏడాదిన్నర (జర్మనీ లో ఆరు నెలలు కలిపితే) ఉంటే అప్పుడు రక్తదానం చెయ్యొచ్చు

అమెరికాలో అనుబంధాల గురించి ఇప్పటికే చెప్పేసాను, ఇక దానిలో మరో కోణం చెప్పాలి.ఇక్కడ సాధారణంగా పదిహేను దాటగానే పిల్లలు స్వతంత్రంగా బతకడం మొదలుపెడతారు.ఒక రకంగా పెద్దల చేయి దాటి పోతారు. నేను అమెరికా వచ్చిన కొత్తలో నాకొక కొలీగ్ ఉండేవాడు. అతను ఇంజినీరింగ్ విద్యార్థి. వేసవి సెలవులలో ఇలా పని చేస్తున్నాడు.
అతనిని ఒక సారి అడిగా “What is your opinion on public transport?”
అతని సమాధానం “We feel using public transport will reduce status symbol“ఇలాంటి అభిప్రాయం వల్ల అతనికి పెద్ద నష్టం లేదు. కానీ ప్రతీ దానిలోనూ పరువు అని పెడర్థాలు తీసే ఆలోచనల వల్ల ?
నాతో పని చేసే ఒక భారతీయురాలు మాటల సందర్భంలో "నాకు ఇక్కడ అమ్మాయి పుట్టనందుకు సంతోషంగా ఉంది" అంది. కారణమేమిటో నేను చెప్పనవసరం లేదు. కానీ ఇక్కడ చెప్పదగ్గ ఒక సన్నివేశం గుర్తుకొస్తోంది, అమెరికాలో నేను ఒక స్పీకింగ్ క్లబ్ లో జాయిన్ అయ్యాను. అక్కడకి ఒక పంతొమ్మిదేళ్ళ కుర్రాడు వచ్చేవాడు. మాటలలో తెలిసిన సంగతేమంటే అతనికి ఒక కూతురు ఉందని, అతని గర్ల్ ఫ్రెండ్ ప్రస్తుతం గర్భవతి అని. అయితే ఆ కుర్రాడి తండ్రి అతనికి అండగా నిలబడ్డాడు. అది వేరే విషయం. ఇలాంటి పరిస్థితులున్న సమాజంలో పిల్లలను పెంచడం కత్తి మీద సామేనని నేను చెప్పనవసరం లేదు అక్కడికేదో భారతదేశంలో ఇలాంటి పరిస్థితి లేదని కాదు, కాకపోతే కొంచెం నయం అంతే.
ఇక అమెరికన్ సమాజంలో అందరూ చర్చించే తెలుపు-నలుపు జోలికి నేను పోవడం లేదు. అనేక వివక్షలున్న భారతదేశం నుంచి వచ్చి ఈ దేశపు లోపాలు ఎంచే గురవింద పనులు చెయ్యదల్చుకోవడం లేదు. ఇహ పోతే, ఇక్కడ గమనించిన మంచి విషయం మగవారితో సమానంగా ఆడవారికి అవకాశాలు ఉండడం, అవి వారు అంది పుచ్చుకుని మంచి స్థానాలకు చేరుకోవడం. (ఇండియాలో ఎంత సమాన అవకాశాలున్నాయో నేను చెప్పనవసరం లేదు)

నా కళ్ళు ఇంకా చాలానే చూసాయి, చాలానే చెప్తానని మారాం చేస్తున్నాయి. పరుగేలనోయి, అని నా వేళ్ళు ఆగుతున్నాయి ప్రస్థుతానికి

# ఉగాది నుంచి ఉగాదికి (నా కళ్ళతో అమెరికా) - 4

21 Apr 2009

నిజం సినిమాలో హీరోయిన్ రక్షిత మిట్టమధ్యాహ్నం జాగింగ్ చేస్తుంది. అది ఆ సినిమాలో ప్రకాష్ రాజ్ దారి మళ్లించటానికి హీరో ఎంచుకునే పధకం. ఆ సినిమా చూసినప్పుడు నవ్వుకున్నా, మరీ మనవాళ్ళు ఇంత బుర్ర లేకుండా కామెడీ సీన్లు పెడతారేమిట్రా అని.

మా ఆఫీస్ చుట్టూ ఒక రన్నింగ్ ట్రాక్ ఉంటుంది, ఉద్యోగులు జాగింగ్ చేసుకోడానికి. కొంత మంది ఉద్యోగులు సరిగ్గా భోజనసమయానికి రన్నింగ్ చేసేవాళ్ళు. అలాగే ఆఫీస్ ముందు బోలెడు పచ్చిక ప్రదేశం ఉంది. అందులో లంచ్ సమయంలో కొన్ని ఎక్సర్ సైజ్ తరగతులు జరిగేవి.

తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్టు, అనేక వింత అలవాట్లు ఇక్కడి జనాలివి.

రోజుకు ఒక లీటర్ కోక్ బాటిల్ ని ఊదేసి నేను డైటింగ్ చేస్తున్నా అనేవాళ్ళు కొందరు

రెండువందల మీటర్లలోపు దూరానికి కూడా కారులో తిరుగుతూ తరువాత చెమటలు కక్కిస్తూ రన్నింగ్ చేసేవాళ్ళు వగైరా......

"You've Got Mail" అనే ఒక సినిమాలో "star bucks" కాఫీ గురించి ఒక డైలాగ్ ఉంటుంది. అమెరికాలో star bucks కాఫీ లేకుండా రోజు ప్రారంభమవ్వదు చాలా మందికి అని. ఆ star bucks సంగతేమో కానీ, అమెరికాలో చాలా మందికి కాఫీ లేకుండా రోజు గడవదు. సరే, వీళ్ళు తాగేది కాఫీ అందామంటే అది కాస్తా ఒట్టి డికాషిన్. ఎంత పాలపొడి కలిపినా, ఎంత చక్కెర కలిపినా మన ఆంధ్రా కాఫీ రుచి రాదు. ఈ దెబ్బకు చివరకు ఆఫీసులో కాఫీ తాగడమే మానేసాను. ఎలాగూ ఇంటిలో తాగను, అది వేరే విషయం.

ఆఫీసులో ఉన్న వారంతా కలిసి పని చెయ్యాలంటే, వారి మధ్య స్నేహముండాలి. కేవలం పని చేస్తూ ఉంటే వారి మధ్య స్నేహం ఎలాగూ వృద్ది చెందదు. అందుకే మా ఆఫీసులో ఒక నిర్ణయానికి వచ్చాము, ప్రతీ శుక్రవారం టీమ్ అంతా కలిసి బయటకు లంచ్ కి వెళ్ళాలి అని. శాకాహారునిగా నా జర్మనీలోని అనుభవాల దృష్ట్యా ఈ నిర్ణయం నాకు కొంచెం బాధను కలిగించింది. సరేలే వారానికొక రోజే కదా అని. నా బాధకు తోడు మొదటి వారం మెక్సికన్ రెస్టారెంట్ కి వెళ్ళాము. అక్కడ ఏమి తీసుకోవాలో బుర్ర బద్దలు కొట్టుకుని ఒక పిజ్జా చెప్పాను. అది వచ్చిన తర్వాత నా మొహం చూడాలి, ఎంత సుందరంగా ఉందో... మొత్తం ఎర్ర చిక్కుళ్ళతో నిండి. ఆహా... భలే మొదలయ్యిందిలే అమెరికాలో రెస్టారెంట్లలో భోజన సంగ్రామం అనుకున్నా.. అయితే, ఆ తరువాత నుండి వెళ్ళిన ప్రతీ రెస్టారెంటులోనూ ఏదో ఒక శాఖాహార పదార్ధముండడం వల్లనూ, అమెరికన్ తిండి కూడా రుచిగా ఉండడం వల్లనూ ఆ తరువాత బాధ పడలేదు. అయితే తరువాతి రోజులలో ఆర్ధిక మాంద్యం వల్ల ఆ లంచ్ కాస్తా రెండు వారాలకొకసారిగా రూపాంతం చెందింది. ఒక వీకెండ్ సాయంత్రం ఆఫీస్ తరపున ఒక పిక్నిక్ (పార్టీ అనాలేమో, కానీ జరిగింది పిక్నిక్ లా) కి వెళ్ళాము. వెళ్ళిందే సాయంత్రం ఆరింటికి. అప్పటికే అక్కడ ఉన్నవాళ్ళు తిండి లాగిస్తున్నారు. ఏదో సాయంత్రపు చిరుతిళ్ళేమో అనుకున్నా, ఒక గంట ఆగి అక్కడ ఫుడ్ కౌంటర్ దగ్గరికి పోయి చూద్దును కదా, బయలుదేరడానికి పాకింగ్ చేసుకుంటున్నారు. ఆ తరువాత మెల్లిగా అర్ధమయిన సంగతేమంటే, అమెరికన్ల పార్టీలలో డిన్నర్ అంటే రాత్రి ఏడుకల్లా అయిపోతుంది అని.

ఈ ఆఫీస్ గోల పక్కన పెడితే, ఒకానొక శుభదినంబున ఆఫీసుకి వెళ్ళేప్పుడు బద్దకంలో వంట చేసుకోలేదు సీన్ కట్ చేస్తే మద్యాహ్నం ఏ గడ్డి తినాలో అన్న ఆలోచనల్లో నేను. మా ఆఫీసుకి దగ్గరలోనే "సబ్ వే" ఉంది. సరే అని దానిలో దూరా... మహా రద్దీగా ఉంది. ఇంతా చేస్తే అక్కడ దొరికేవి రెండే పదార్ధాలు శాండ్ విచ్, పిజ్జా. ఆ రోజు నుంచి నేను సబ్ వేకి చిన్న సైజు పంఖానైపోయా... కొన్ని సార్లు కావాలని వంట చెయ్యకపోవడం, కొన్ని సార్లు బద్దకంతో చెయ్యకపోవడం, వెరసి వారానికి మూడు రోజులు సబ్ వేలో తినడం. ఇక ఆ సబ్ వేలో నేనెంత నోటెడ్ అయిపోయానంటే నన్ను చూడగానే నేనేమీ చెప్పకుండానే వాళ్ళే శాండ్ విచ్ తయారు చేసేంతలా..

అమెరికా వచ్చిన కొత్తలో అమెరికన్ ఆహార పదార్ధాల గురించి తెలియకపోతే చేసే తప్పులు చీస్ బర్గర్ , చీస్ పిజ్జాలు శాకాహారాలనుకుని ఆర్డర్ చేసే శాకాహారులు. (మొదటి సారి ఇలాంటి పరిస్థితి ఎదురవుతుంది, సరిగ్గా తెలుసుకోకపోతే) పెప్పరానీ (పంది మాంసం) పిజ్జా అంటే పెప్పర్ తో చేసిన పిజ్జా అనుకునే వాళ్ళు.. నాన్ ఫాట్ యోగర్ట్ తెచ్చుకుని పెరుగు బాగోలేదనుకోవడం. ఫ్రెంచ్ ఫ్రైస్ ఇంటికి తెచ్చుకుని తిందామనుకోవడం... హోమ్ మేడ్ బీఫ్ వెజిటెబులు సూప్ వంటి పేర్లు చూసి మూర్చపోవడం (మూర్చ అన్నది ఏదో మాట వరసకే)
మెక్సికన్ టాకోను చూసి చపాతీలనుకోవడం ... అయితే ఇలాంటి కష్టాలు ఆహారపదార్ధాల అసలు పేర్లు తెలుసుకునేవరకే... తిండి కబుర్లయిపోయాక, ఇక నిద్రపోదామంటాయి కన్నులు. అందుకే ప్రస్తుతానికి సశేషం....

# ఉగాది నుంచి ఉగాదికి (నా కళ్ళతో అమెరికా) - 5

25 Apr 2009

ఒక రోజు వాల్ మార్ట్ కి వెళ్ళినప్పుడు ఎప్పుడూ పేరైనా వినని ఒక వస్తువు నా కంట పడింది ఆ వస్తువు పేరు " బనానా స్టాండ్ ". అమెరికన్ల పిచ్చికి ఒక ఉదాహరణ మాత్రమే ఇది. ఇలా పనికి వచ్చేవాటికీ, పనికి రాని వాటికీ వస్తువులు దొరుకుతాయి. వాల్ మార్ట్ కానీ, మరే ఇతర షాపింగ్ ప్రదేశం కానీ వినియోగదారుల చేత ఎక్కువ ఖర్చు పెట్టించడానికే చూస్తాయి నెత్తి మీద రూపాయి పెడితే పావలాకు కూడా అమ్ముడు పోని వస్తువులను సైతం లాభానికి అమ్మగల ఘటికులు వీళ్ళు అక్కడికేదో అమెరికాలో షాపింగ్ భూటకం అనుకోడానికి లేదు. నాణ్యత విషయంలో తిరుగు లేదు, వినియోగదారుని హక్కులు కాలరాలవు. ఇంచుమించు ప్రతీ వస్తువునూ నచ్చకపోతే వెనక్కి తిరిగి ఇచ్చివేయవచ్చు

షాపింగ్ గురించి రాస్తుంటే 2007 జర్మనీ క్రిస్ మస్ గుర్తుకొస్తోంది. వారానికి ఆరు రోజులు మాత్రమే తెరచి ఉండే షాపులు. (చాలా హోటల్సుతో సహా!). పని గంటలైతే ఉదయం ఎనిమిది నుంచి రాత్రి ఎనిమిది వరకే. ఇక సెలవురోజులలో చెప్పనవసరమే లేదు. ఆ క్రిస్ మస్ సరిగ్గా శని ఆదివారాల తర్వాత రావడంతో మొత్తం నాలుగు రోజులు వరస సెలవులు షాపులకి మా రూములో లేని సరుకులు. డబ్బులున్నా బయట కొందామన్నా ఏ షాపులూ, హోటళ్ళు తెరచి ఉండని పరిస్థితి. ఎలాగో ఆ నాలుగు రోజులూ గడిచాయి. అయితే అమెరికాలో అలాంటి పరిస్థితి చాలా వరకు ఎదురు కాదు (పూర్తిగా మంచుతో నిండిపోయే ప్రదేశాలలో పరిస్థితి నాకు తెలియదు).
ఏదో థాంక్స్ గివింగ్ డే అట వస్తువులు చవకగా ఇస్తారట.. అయితే ఆ రోజు చవకగా వస్తువులు చేజిక్కించుకోవడానికి ముందు రోజు సాయంత్రం నుంచే క్యూలుంటాయి. (ఒక్క ఖుషి సినిమాకి తప్ప ముందు రోజు సాయంత్రమే క్యూలు తయారయిన సంగతి నేను వినలేదు. తిరుపతి వెంకన్న దర్శనానికి ఉండే క్యూల సంగతి వేరు దానిని ఇలా షాపింగ్ తో పోల్చడం నాకిష్టం లేదు) చికాగో, మిచిగాన్ లాంటి ప్రదేశాలలో గడ్డకట్టే చలిలో తరువాతి రోజు షాప్ తెరిచేవరకు వేచి చూసి కావల్సిన వస్తువును తక్కువ ధరకు

సొంతం చేసుకునే వాళ్ళు అనేకులు. అమెరికన్ల వెర్రికి (ఆ థాంక్స్ గివింగ్ క్యూలలో ఇండియన్స్ కూడా ఎక్కువ మందే ఉంటారని విన్నాను) ఇది పరాకాష్ట.

అయితే దీనిని మించిన వేలం వెర్రి వేరే ఉంది. ఏ కొత్త వస్తువైనా మార్కెట్ లోకి విడుదలయినప్పుడు ప్రకటనలు ఇలా ఉంటాయి

"ఈ వస్తువు వాడకపోతే మీరు వెనకబడి ఉన్నట్టు. కనుక వెంటనే వాడండి అరటిపండు వారి మీ ఫోన్..."

ఈ చక్రం ఎలా ఉంటుందంటే వినియోగదారులని ఎక్కడా ఆగనివ్వరు, ప్రకటనల హోరుతో పిచ్చెక్కిస్తారు. ఇప్పుడు ఆ సంస్కృతి మన దేశంలోనూ మొదలయ్యింది, అది వేరే విషయం. ఒక్క అమెరికా ప్రపంచానికి అవసరమైన వనరులలో అధికశాతం ఖర్చు పెడుతోందట , అమెరికాలాగానే ప్రతీ దేశం ఖర్చు పెడితే మొత్తం మూడు నుంచి ఐదు భూ గ్రహాలు కావాలట

భారతదేశంలో ఏ గుడికి వెళ్ళినా ఆ గుడి నుంచి బయటకు రాగానే ఖచ్చితంగా కనిపించేవి దేవుడి పటాలు అమ్మే షాపులు అమెరికాలో ఏ పర్యాటక ప్రదేశానికి వెళ్ళినా కనిపించేవి కూడా అవే... అలాంటి చోట దొరికేవి కాఫీ కప్పులు, ప్లాస్కులు, టోపీలు, టీ షర్టులు వగైరా... (కాఫీ ప్రియులు కదా....). అయితే షాపింగ్ గురించి రాస్తూ ఆన్ లైన్ షాపింగ్ గురించి రాయకపోతే అది అసంపూర్తిగా మిగిలిపోతుంది. షాప్ లో కొంటే వంద డాలర్లకు వచ్చేది ఆన్ లైన్ షాపింగ్ లో ఉచితంగా రావచ్చు లేదా ఇంకా తక్కువ ధరకే రావచ్చు. అందుకే ఎక్కువ మంది ఆన్ లైన్ షాపింగ్ కే ప్రిఫరెన్సు ఇస్తారు. భారతదేశంలో కూడా ఇప్పుడిప్పుడే ఆన్ లైన్ షాపింగ్ రెక్కలు తొడుగుతోంది. ఈ పద్దతిలో వ్యాపారులకు, వినియోగదారులకూ సమయం, ధనం ఆదా. షాప్ కి వెళ్ళావలసిన పని వినియోగదారునికి, షాప్ ని తెరచి మైంటైన్ చెయ్యవలసిన పని వ్యాపారికీ ఉండదు. అయితే తప్పుడు సమాచారంతో వ్యాపారులు మోసం చేసే అవకాశమున్నప్పటికీ అలాంటి కేసులు అమెరికాలో తక్కువే

షాపింగ్ చేసాక నా కళ్ళు కొంచెం విశ్రాంతి కోరుకుంటున్నాయి. అంతవరకు సశేషం.......

# ఉగాది నుంచి ఉగాదికి (నా కళ్ళతో అమెరికా) - 6

4 May 2009

నేను ఆన్ సైట్ రావడానికి ముందు ఒకసారి భారతదేశంలో రాత్రిపూట మా ఆన్ సైట్ కోర్డానేటర్ తో మాట్లాడాల్సి వచ్చింది వెంటనే ఒక మైల్ రాసా, అటు పిమ్మట సరే కాల్ చెయ్యమన్నాడు కానీ కేవలం పది నిమిషాలే మాట్లాడతానంటూ మెలిక పెడుతూ. ఆ పది నిమిషాల సంభాషణ చివరలో అన్నా, మీకు ఇబ్బంది కలిగించినట్టున్నాను. దానికి ఆయన సమాధానం నా ఫోన్ లో మినిట్స్ (నిమిషాలు) లేవు అని. సరే ముందుగా ఈ నిమిషాల గోల చూద్దాం.

సంవత్సరం : 2005 తర్వాత ఏ సంవత్సరమైనా... ప్రదేశం : ఇండియాలో నేనున్న ప్రదేశమేదైనా

సన్నివేశం : ఏదైనా సహాయం కోసమో లేక ఆత్మీయులతో మాట్లాడదామనిపించినపుడో లేక పని లేనప్పుడో చేతిలోనున్న మొబైలులో నంబరులు నొక్కబడేవి. తరువాత ఎంతో కొంత సేపు అవతలివారితో ఒక ఐదు నిమిషాలో, పది నిమిషాలో ఎంతో కొంత సమయం డబ్బు గురించి ఆలోచించకుండానే మాట్లాడడం జరిగేది. ఎందుకంటే ఈ సన్నివేశంలో డబ్బు ఖర్చయ్యేది నాకొక్కడికే. అవతలి వారిని ఇబ్బంది పెట్టడం జరగలేదు

సంవత్సరం : 2008... ప్రదేశం : అమెరికా

సన్నివేశం : ఎవరికి ఫోన్ చెయ్యాలన్నా ఎవరికి చెయ్యబోతున్నానో వారికి కూడా డబ్బులు ఖర్చవుతాయి. ఎవరికి ఫోన్ చెయ్యాలన్నా ఒక్క నిమిషం ఆలోచించవలసినదే. ఇదివరకలా ఊరికే ఫోన్ చేసి మాట్లాడే అవకాశం లేదు. దీనిలో చాలా గొప్ప వ్యాపార కోణం కనిపిస్తోంది నాకు.

భారతదేశంలో ఖర్చు ఎక్కువ ఉంటే అది సామాన్యులకు చేరదు, పైగా అవతలివారు చెప్పే సుత్తి (పనికి వచ్చే విషయాలు కూడా కావచ్చు కాక) కోసం ఖర్చయ్యే ఏ పద్దతీ అంత త్వరగా భారతీయులు హర్షించరు. ఆ కోణంలో జరిగిన మార్పుల వల్ల ఎదురైనదే ప్రస్తుత పరిస్థితి. ఒకప్పుడు పది మందిలో ఒక్కరి వద్ద కూడా లేని మొబైల్ నేడు ప్రతీ ముగ్గురిలో ఒకరి దగ్గర ఉంది అదే సమయంలో విప్లవాత్మకమైన ధరల తగ్గుదల, తక్కువ ధరలో లభించే మొబైల్ ఫోన్లు భారతీయులను మొబైల్ వాడకంలో అగ్ర స్థానానికి పోటీ పడేలా చేస్తున్నాయి. (ప్రస్తుతం మూడవ స్థానం).

మరి అమెరికాలో ఖర్చెక్కువయినా సరే మొబైల్ వాడకం ఎలా ఎక్కువ? మొబైల్ వాడకానికి అమెరికన్లు మొదటగా పరిగణలోకి తీసుకునేది వారి యొక్క ప్రైవసీ.. బహుశా ఇదే కారణం కావచ్చు ఖర్చెంతయినా సరే మొబైల్ వాడకంలో నాలుగవ స్థానంలో ఉండడానికి. ఖర్చు ఖర్చు అని గోల పెడుతున్నా కదా, చిన్న పోలిక చేద్దాం అమెరికా ఫోన్ ధరలకు మరియు భారతదేశంలో ఫోన్ ధరలకు

| ప్రదేశం | ఇన్ కమింగ్ | ఔట్ గోయింగ్ |
|---|---|---|
| భారతదేశం | 0 (రోమింగ్ లోనున్నప్పుడు 1.5 రూపాయలు) | 0 పైసలు నుంచి 1.5 రూపాయల లోపు |
| అమెరికా | 0 పైసల నుంచి 7.5 రూపాయల లోపు | 0 పైసల నుంచి 7.5 రూపాయల లోపు |
| అమెరికా నుంచి భారతదేశం (కాలింగ్ కార్డుల ద్వారా) | - | 50 పైసల నుంచి 5 రూపాయల లోపు |

అందుకే అంటారు, రోములో రోమనులా ఉండమని. ప్రతీదీ డాలర్ల లెక్క చూడవద్దని. ఒకసారి మా అమెరికన్ కొలీగ్ కు ఈ లెక్కలు చెబితే కళ్ళు తేలేసింది. అవును,మరి భారతదేశంలో కంపనీలు అంత తక్కువ ధరలతో ఎలా నడపగలుగుతున్నాయనే సందేహం కలగచ్చు. ఆ సందేహం వచ్చినవారు బహుశా ఇండియాలో టెలివిజన్ లలో sms పోల్స్ కానీ కౌన్ బనేగా కరోడ్ పతీ లాంటి కార్యక్రమాలను గానీ బాంకుల నుంచి క్రెడిట్ కార్డ్ ల కోసం బుర్ర తినే కాల్స్ కానీ అనుభవించి ఉండరు.

అయితే అమెరికాలో ధరలు ఎక్కువ ఉండడానికి నాకు కనిపించే ప్రధాన కారణం"లేబర్ కాస్ట్ " ఎక్కువ కావడమే. అందుకే కాబ్ లో ఆరు మైళ్ళు వెళ్ళాలన్నా 20 డాలర్లు ఖర్చవుతాయి.

ఇక, మళ్ళీ నిమిషాల గోలకు వస్తే ఎక్కడో చదివిన ఒక వ్యాక్యం గుర్తుకు వస్తోంది"Americans don't know meaning of rest of world ". దీనిలో పెద్దగా సందేహించడానికేమీ లేదనే నాకనిపిస్తుంటుంది వారి లెక్కలు వారివి, ప్రపంచం ఒక యూనిట్ వాడితే అమెరికా మరో యూనిట్ వాడుతుంది, అనేక భారతీయులకు అమెరికాలో ఎదురయ్యే సమస్యల్లో ప్రధానమైనదిదే ప్రమాణాలకు అనుగుణంగా మారడం. ప్రమాణాలంటే ఎక్కువ ఊహించనవసరం లేదు, చిన్ని చిన్ని విషయాలే....
లీటర్ల పెట్రోల్ గాలన్ల గాస్ అవుతుంది ... కిలోమీటర్ల దూరం మైళ్ళ దూరమవుతుంది... కిలోల లెక్క పౌండ్లకు మారుతుంది గ్రాముల లెక్క ఔన్సులకు మారుతుంది .... ఎడమవైపు డ్రైవింగ్ కుడివైపుకు తిరుగుతుంది ... నేషనల్ హైవేలు ఇంటర్ స్టేట్ లవుతాయి ... కాలేజీలు కాస్తా స్కూళ్ళగా పేరు మార్చుకుంటాయి

మొబైల్ లో బాలన్స్ కాస్తా రూపాయల లెక్క నుంచి నిమిషాల లెక్క చూడడం మొదలవుతుంది(కొన్ని సార్లు ఎవరు ఫోన్ చేసినా బాలన్స్ లేక ఫోన్ పెట్టెయ్యమనే పరిస్థితి కూడా ఎదురు కావచ్చు)

అయితే ఆనందించాల్సిన విషయం కాలం లెక్కలు మారకపోవడం. ఎక్కడికెళ్ళినా అవే నిమిషాలు, అవే సెకన్లు... మనిషి కాలానికి అతీతుడు కాడనడానికి ప్రతీకగానేమో!!!
కాలమా... నీ చేతిలో ఎవరికైనా ఓటమి తప్పదు కదా....

బహుశా ప్రపంచ చరిత్రలో ప్రజలందరూ ఒక్కతాటిన నిలిచేది కాలం విషయంలోనేమో!
ఈ అమెరికా కబుర్లు ఇప్పటికి సశేషం... (ఇంకెన్ని కనీసం మరో రెండు భాగాలు)

# ఉగాది నుంచి ఉగాదికి (నా కళ్ళతో అమెరికా) – 7

12 May 2009

ఐదార్లు ఎంత?
తెలిసి కూడా చెప్పకపోతే నిన్ను అమెరికాలో పుట్టిస్తా అని బ్రహ్మ నిర్ణయం తీసుకున్నట్టున్నాడు, అందుకే అమెరికాలో ఎక్కువ మంది ఇలాంటి చిన్న లెక్కలకు కూడా కాలిక్యులేటరులు వాడుతుంటారు.
ఒక రోజు సాయంత్రం లైబ్రరీకి వెళ్లి కూర్చుంటే అక్కడ పాఠాలు చెప్పే పంతులమ్మలు కనిపించారు, పిల్లలకు పాఠాలు చెబుతూ. బహుశా ట్యూషన్లేమో.. అయితే నన్ను ఆశ్చర్య పరచిన విషయం ప్రతీ చిన్న లెక్కకూ కాలిక్యులేటరు వాడుతూ ఉండడం.
ఇదే సంగతి మీద ఒక అమెరికన్ తో మాటల సందర్భంలో వేలెత్తి చూపితే వచ్చిన సమదానమేమంటే
" అమెరికాలో చదివే చాలా మంది పార్ట్ టైం జాబ్స్ చేస్తూ చదువుతారు కనుక చదువు మీద ఏకాగ్రత చూపే సమయం తక్కువ. అందుకే ఉన్న తక్కువ సమయంలో మెదడుకు శ్రమ ఇవ్వకుండా ఇలా చేస్తాం. ఒక వ్యక్తి అమెరికాలో ఇంజినీరు కావాలంటే చాలా కష్ట పడాలి, ఖర్చూ పెట్టాలి. "
ఏదో కొంచెం సమాధానపరచినా అంతగా సంతృప్తి చెందలేదు ఈ సమాధానంతో నేను

ఒక పొడవాటి హాలు, మీకు పది అడుగుల దూరంలో ఒక వ్యక్తి తలుపును చేరాడు. ఆ వ్యక్తి తలుపు తీసి వెళ్ళే ముందు ఏమి చేస్తాడు? అతను అమెరికన్ అయితే మీరు వచ్చేవరకు తలుపును తెరచి పట్టుకుని ఆగుతాడు. అమెరికాలో ఉండే భారతీయుడైతే తలుపు వేద్దామా వద్దా అని ఆలోచించి మీరు వచ్చేవరకు ఆగుతాడు. అదే శుద్ధ భారతీయుడైతే తలుపేసి వెళ్లిపోతాడు.
ఇలాంటి విషయాలు చాలానే నేర్చుకోవాలి అమెరికన్ల నుంచి

అమెరికన్ల నుంచి నేర్చుకోవాల్సిన నీతి మరొకటి కూడా ఉంది. మనకు తెలిసిందే ప్రపంచమనుకోవడం వల్ల వచ్చే దుష్పరిణామాలు ఉంగరం కుడి చేతికి పెట్టుకుంటే ఏమవుతుంది? ఇండియాలో ఒకటేం ఖర్మ, పది వేళ్ళకూ పది ఉంగరాలు పెట్టుకునే ఘనులూ ఉన్నారు. నేను కుడి చేతికి ఒక్క ఉంగరం పెట్టుకోవడం వల్ల కాసేపు పెళ్లి అయినవాడినేమోనని నా అమెరికన్ కొలీగ్స్ సందేహించారు. ఇలాంటి పరిస్థితి నాకు జర్మనీలో ఎదురు కాలేదు. నా కుడి చేతికున్న ఉంగరం వల్ల నా కొలీగ్స్ వెలిబుచ్చిన సందేహాలు

- నీకు పెళ్ళయిందా ? (ఇంకా నయం ఎంత మంది పిల్లలని అడిగారు కాదు)

- పెళ్ళయిందని బిల్డప్ కోసం ఉంగరం పెట్టుకున్నావా ? (అవును మరి, ఎ అమెరికన్ బ్యూటి నన్నెత్తుకుపోతుందో అని భయం)
- నీకు నిజంగా పెళ్లి కాలేదా ? (అమ్మో, ఇదేమి ఖర్మరా బాబూ... పెళ్లి కాలేదని చెప్పినా నమ్మరే)
- మరి ఎందుకు ఉంగరం పెట్టుకున్నావ్ ? (నేనేమి చేతురా భగవంతుడా!!)

అయితే అమెరికా గురించి రాస్తూ అమెరికాలో ఉన్న భారతీయుల గురించి రాయకపోతే నేను రాస్తున్న ఈ వ్యాస పరంపర ఎప్పటికీ సశేషంగానే ఉంటుంది.

ప్రపంచంలో ఏ మూలకు వెళ్ళినా బహుశా మొదట కనిపించేది చైనీయులు, తరువాత ఇండియన్లు ఏమో! అమెరికాలోనే కాదు, ఏ అభివృద్ధి చెందిన దేశమేగినా భారతీయుల మాటలలో నాకు నచ్చని విషయాలు చాలానే ఉన్నాయి ఇది ఆత్మ విమర్శ అనుకోవలసిందే. ఆ విషయాలకు వెళ్ళే ముందు, రామకృష్ణ పరమహంస గారి దగ్గరకి చక్కర మాన్పించమని తన కొడుకుని తీసుకు వచ్చే ఒక తల్లి కథ అందరికి తెలిసే ఉంటుంది. మనం సరైన మార్గంలో ఉన్నప్పుడే అవతలివారికి నీతి భోధలు చెయ్యాలి. అందుకే నేను ఇప్పుడు రాయబోయే విషయాలు కేవలం ఆత్మ విమర్శ మాత్రమే అమెరికాలో ఉండే చాలా మంది భారతీయులు అవకాశం ఎప్పుడు దొరుకుతుందా భారతదేశాన్ని తిడదామని ఎదురు చూసే వారే.

- డ్రైవ్ చేస్తూ మన రోడ్లు ఇంత నీట్ గా ఉండవనేవాడొకడు ( అవును మరి, రోడ్డు మీద ఉమ్ము ఊసేప్పుడో ఇష్టం వచ్చినట్టు రోడ్డు మీద దూసుకుపోయినప్పుడో ఇలాంటి విషయాలు గుర్తు రాలేదు సడన్ గా ధ్యానోదయమయ్యి మొత్తం ఇండియాని తిట్టడం మొదలు)
- వాచ్ వంక చూస్తూ మన వాళ్లకు టైం సెన్స్ లేదు. వీళ్ళు చూడు ఎంత ఖచ్చితంగా సమయానికి వస్తారో (ఇండియాలో సినిమా థియేటరుకి తప్ప ఇంకెక్కడికైనా సమయానికి వెళ్ళావా ?)
- అబ్బ, లంచం ఇవ్వకుండా పనులెంత బాగా జరుగుతాయో (ఏనాడైనా లంచం ఇచ్చిన వాడిని ఆపగలిగావా?)
- పని మీద వీళ్ళకెంత శ్రద్ధో!! (ఏనాడైనా వ్యక్తిగత పనులు చెయ్యకుండా ఆఫీసులో పని చేసావా?)
- ఎంత విశాలంగా ఉన్నాయో ఇళ్ళు (అమెరికాలో జన సాంద్రతను ఇండియాలో జన సాంద్రతను ఎప్పుడైనా పోల్చి చూసావా ?)
- అబ్బ ఎంత బాగా తుమ్మారో ..... (అమ్మో ఇంకా ఇవి రాస్తూ ఉంటే నేనేమి రాయాల్సి వస్తుందో )

అమెరికాలో భారతీయులు చేసే గురవింద వ్యాఖ్యలు చాలానే ఉన్నాయి అయినప్పటికీ అమెరికాలోని భారతీయులు చాలా మంది తమ దేశాన్ని మర్చిపోరు. కనీసం అలాంటి వ్యాఖ్యల ద్వారానైనా గుర్తు చేసుకుంటూనే ఉంటారు పండగలు కలసి జరుపుకుంటారు, ముఖ పరిచయం లేని వారు అమెరికా వచ్చినా చేయగలిగిన సాయాలు చేస్తారు, ఫంక్షన్లకు కలుస్తారు, ఇండియాలోని సంఘ సేవా కార్యక్రమాలకు సాయం చేస్తారు, మొత్తంగా భారతీయతను చాటి చెప్తారు.

ఇప్పుడొక చిన్ని ప్రశ్న,
"ఇద్దరు తెలుగు వాళ్ళు ఏ భాషలో మాట్లాడుకుంటారు?"
అ) తెలుగు ఆ) ఆంగ్లము ఇ)హిందీ
ప్రస్తుత పరిస్థితులలో "ఆ" కే ఎక్కువ మార్కులు పడతాయి. (నిజానికి మూడూ సరైన సమాధానాలే)

మరి, "ఒక తమిళుడు, ఒక తెలుగు వాడు ఏ భాషలో మాట్లాడుకుంటారు?"

అ) తమిళం ఆ) తమిళం ఇ) తమిళం

ఈ ప్రశ్నకు కళ్ళు మూసుకుని తమిళమే చెప్పాలి.

భారతదేశం నుంచి వచ్చిన వారంతా, ఈ అరవ గోల ఒకవైపు. తమిళులపై నాకెలాంటి ద్వేషం లేకపోయినా.. వారి నుంచి నేను సాయాన్ని పొందినప్పటికీ ఈ విషయంలో మాత్రం విమర్శించక మానను

ముక్తాయింపు తరువాయి భాగంలో....

# ఉగాది నుంచి ఉగాదికి (నా కళ్ళతో అమెరికా) – 8

15 May 2009

అమెరికాలో బతకాలంటే ఏ భాష రావాలి ?

నాకు పిచ్చి ఎక్కలేదు కానీ ఈ ప్రశ్నకు సమాధానం "అమెరికన్ ఇంగ్లీష్"

భారతీయులు ఎక్కువగా అభ్యసించేది బ్రిటీష్ ఇంగ్లీష్. పైగా అమెరికన్ యాస ఎవరో తరుముకొస్తున్నట్టు సగం ముక్కలు చేసో లేక మొత్తం కలగాపులగం చేసేసో ఉంటుంది.

అందుకే అమెరికన్ నేలపై ఇంగ్లీష్ సినిమాలు చూడకుండానో అమెరికన్ వార్తా చానళ్ళు చూడకుండానో అడుగుపెడితే అత్యంత అయోమయ పరిస్థితిలో పడతాం. ఈ పరిస్థితి ఎలాంటిదంటే గోదావరి జిల్లా నుంచి హైదరాబాదు వచ్చినప్పుడు పడే పరిస్థితి అన్నమాట.

మనం చెప్పేది అవతలివాడికి అర్థం కాదు, అవతలివాడు చెప్పేది మనకు అర్థం కాదు. తీరా చూస్తే మాట్లాడే భాష ఒకటే.

ఉదాహరణకు " I'm good " అంటే అర్థమేమిటి?

స్వచ్ఛమైన ఆంగ్లంలో "నేను మంచివాడిని" అనే కదా.. అదే అమెరికన్ ఇంగ్లీష్ లో "నన్ను వదిలేసి పోరా" అని మర్యాదగా చెప్పడమన్నమాట.

అంటే ఒకరకంగా చెప్పాలంటే, అమెరికన్ మాండలీకం ప్రత్యేకంగా ఉంటుంది. అది అర్థం చేసుకునేసరికే కనీసం మూడు నెలలు పట్టొచ్చు.

ఇక్కడ అమెరికాలో నేను కలిసిన ఒక ఆంగ్ల ప్రొఫెసర్ చెప్పిన డైలాగ్ చెబితే సంపూర్ణంగా ఉంటుంది

" Most of Americans speak bad English "

కాబట్టి అమెరికా ప్రయాణం చెయ్యాలనుకుంటే ముందు అమెరికన్ ఇంగ్లీష్ నేర్చుకోవాలి. అంటే మన ఆంగ్ల విద్యా ప్రావీణ్యాన్ని మనమే తగ్గించుకోవాలి.

(నేను ఎలాగూ ప్రావీణ్యున్ని కాను కనుక పర్లేదు, అది వేరే విషయం). ఒక వేళ పొరపాటున షేక్స్ పియర్ రాసిన ఇంగ్లీష్ చదివి అమెరికా వస్తే మీ మతి చెడకుండా ఆ దేవుడే కాపాడు గాక.

ఒక వస్తువు ధర 9.87 డాలర్లు, పది డాలర్లిస్తే మీకు చిల్లర ఎంత రావాలి ?
ఇండియాలో అయితే సున్నా (డాలర్ల స్థానంలో రూపాయలు పెట్టుకోండి)
అమెరికాలో (యూరప్ తదితర దేశాలలో కూడా) వచ్చే చిల్లర 13 సెంట్లు. ఇండియాలో పైసకు విలువ సంగతి తర్వాత అర్ధరూపాయికే విలువ లేదు. అది వేరే విషయం.

అమెరికా గురించి రాస్తూ అమెరికాలో విహార ప్రదేశాల గురించి రాయకపోతే ఈ వ్యాస పరంపరకు సరైన ముగింపు ఇవ్వనివాడినే అవుతాను.

నిజానికి అమెరికాలో నేను ప్రదేశాలు పెద్దగా చూసిందేమీ లేదు. ఫ్లోరిడాలోని డిస్కవరీ స్టూడియోస్ తప్ప.
నేను అమెరికా రాక ముందు చాలా మంది చెప్పారు, డిస్కవరీ స్టూడియోస్ కి తప్పని సరిగా వెళ్ళమని. నాక్కూడా వెళ్ళాలనే ఉండడంతో మొత్తానికి వెళ్ళడం జరిగింది.
అయితే చెప్పుకోదగ్గ స్థాయిలో నన్నాకర్షించలేదనే చెప్పాలి. కారణమేమంటే ఎక్కువ ఉండేవి రోలార్ కోష్టర్లు.
ఒక్కో హాలీవుడ్ హిట్ సినిమా కాన్సెప్టుతో ఒక్కో రైడ్ అన్నమాట. అక్కడ ఉన్న నాలుగు రోజుల్లో ఒక్క రోజు అయ్యేసరికే ఉత్సాహం నీరు కారిపోయింది నా అంచనాలకు అందకపోవడంతో.
అయితే కొన్ని చక్కని షోలు లేకపోలేదు.
నా అంచనాలకు ఎందుకు అందలేదు అని ఎవరైనా అడిగితే వారికి నా సమధానం " ఒక సారి యూరోపా పార్కుకి వెళ్ళమని ".
మొత్తానికి ఎక్కడ చూసినా వ్యాపార ధోరణే ఎక్కువ కనిపించింది నాకు

ఇదీ నా కళ్ళతో చూసిన అమెరికా. ఇక అమెరికాను "ఆహా మెరిక" అనాలో "ఆ మరక" అని తీసిపారాయాలో ఈపాటికే చదువరులకు ఒక అవగాహన వచ్చే ఉంటుంది.
ఒక్క ముక్కలో చెప్పాలంటే అమెరికా "మరకల్లోనూ మెరికే"... "మెరికలకూ మెరికే"

**ముగింపు**

ప్రస్తుతానికి అమెరికాలో ఉన్నా,
నల్ల మబ్బులు వర్షపు జల్లులు కురిపించడానికి సిద్ధమయిన క్షణం నా మనసు మా ఇంటి డాబా మీదకు పరిగెడుతుంది
వర్షం పడిన ప్రతీసారీ నా శరీరం అందులో మట్టివాసన కోసం వెతుకుతుంది, అది ఎందుకు మా ఊరి మట్టి వాసనలా ఉండదు
ఆగకుండా వర్షం కురుస్తుంటే మా బావిలో నీళ్ళెంతవరకు నిండాయా అని నా మనసు పరుగులు తీస్తుంది
ఉరుములు ఉరుముతుంటే "అర్జునా.. బయటకు వెళ్ళకు" అనే అమ్మ మాటలు గుర్తుకొస్తాయి
భానుడు ఎండ వేడితో చెమటను కక్కిస్తుంటే, మా ఇంటి ముందున్న మామిడి చెట్టు కింద పడుకుందామని పరుగులు

తీయుస్తుంది నా మనసు
మంచులో మునిగి చలి పుడుతున్న వేళ, కాలేజీ రోజులలో ఊటీకి వెళ్ళి చలిలో చేసిన అల్లరులు గుర్తుకొస్తాయి
చలి చంపుతున్న వేళ, మేక పాలు చేసే మేలు గురించి నాన్న చెప్పిన కబుర్లు వెంటాడతాయి
అమావాస్య వేళ ఆకాశంలో చుక్కలు చూసినా, పున్నమి వేళ వెన్నెలలో తడిసినా మా ఇంటి మీద డాబా మీద అందరం కలిసి కబుర్లు చెప్పుకున్న క్షణాలు వెంటాడతాయి
అందుకే ఎవరో మహాకవి అన్నట్టు "ప్రపంచమంతా తిరగాలి, తిరిగి మా ఇంటికి రావాలి"